క్లుప్తంగా

పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహం వితరణ

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెంలోని కోదండ రామస్వామి దేవాలయంలో పంచలోహాలతో తయారు చేసిన పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహాన్ని దాత వితరణ చేసినట్లు ఆలయ అర్చకుడు వెంకట రమణ మూర్తి శుక్రవారం తెలిపారు. నాలుగో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రముఖ వ్యాపార వేత్త కె.రామకోటేశ్వరరావు- కృష్ణవేణి దంపతులు పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహానికి అభిషేకాలు, అర్చనలు, విశేషపూజలు చేసి విగ్రహాన్ని అందజేశారు.

విద్య ద్వారానే దేశం అభివృద్ధి

నరసరావుపేట రూరల్: విద్య ద్వారానే దేశం అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.గురులింగం తెలిపారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఎస్ఆర్‌కేటీ కాలనీ మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్షరం అనే జ్యోతి జీవితం అనే దీపాన్ని వెలిగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సుధాకర్, ఎస్.సుబ్బారావు, ఎం.అపర్ణ, కె.ఫాతిమా పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

నరసరావుపేట టౌన్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జాతీయ లోక్‌అదాలత్ శనివారం నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి న్యాయ మూర్తి పి.వి.ఎస్.సత్యనారాయణ మూర్తి శుక్రవారం తెలిపారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులు పరిష్కరించనున్నట్లు చెప్పారు.

రోటరీ.. వయోజన విద్యాకేంద్రం ప్రారంభం

చిలకలూరిపేట టౌన్: ప్రతి ఒక్కరూ చదవడం, రాయడం నేర్చుకోవాలని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ పీవీ సుబ్బారావు సూచించారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో రోటరీ వయోజన విద్యాకేంద్రం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు విద్యావంతులైతే కుటుంబాల్లో విద్యావంతుల శాతం పెరుగుతుందని చెప్పారు. రోటరీ వారు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కాపు వెంకటరావు, డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, తాళ్ల అంజిరెడ్డి, గల్లా సాంబశివరావు, తియ్యగూర యశ్వంత్‌రెడ్డి, తోటకూర వెంకట నారాయణ, ఆళ్ల వేమనరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట టౌన్: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మండలంలోని పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ ఆర్.అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. తాతపూడి, రామచంద్రాపురం, మురికిపూడి, పసుమర్రు, గొట్టిపాడు, మిట్టపాలెం, నాగభైరువారిపాలెం, కొత్తపాలెం, మానుకొండవారిపాలెం, దండమూడి, గోపాలంవారిపాలెం, కట్టుబడివారిపాలెం, పోతవరం, రాజాపేట గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

వైభవంగా రేణుక అంకమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట

నాదెండ్ల: చందవరం గ్రామంలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రేణుక అంకమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలిరోజు అమ్మవార్లకు చీరాలకు తరలించి సముద్ర స్నానం అనంతరం శాలివాహన సంఘం సభ్యులు ఊరేగింపు నిర్వహించి ఆలయంలో ప్రతిష్ఠించారు. భారీ అన్నదానం చేశారు. కార్యక్రమాలను శాలివాహన సంఘం సభ్యులు కొల్లిపాక నాగేశ్వరరావు, మస్తాన్‌రావు, పోతురాజు, రాంబాబు, నాగార్జున, కిషోర్, అంకమ్మరావు, అర్జునరావు పర్యవేక్షించారు.

స్టేట్ టు నేషనల్స్ ..

షటిల్ బ్యాడ్మింటన్‌లో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన మోడల్ స్కూల్ పీజీటీ

కారెంపూడి: జాతీయ స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు కారెంపూడి ఆదర్శ పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ పీజీటీ ఇంగ్లిష్ అధ్యాపకుడు డాక్టర్ బోరుగడ్డ రవికుమార్ ఎంపికయ్యారు. విజయవాడలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో రవికుమార్ ఆడి సత్తా చాటి మన రాష్ట్రం నుంచి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడలో శుక్రవారం జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఎంప్లాయిస్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రవికుమార్ సత్తా చాటి నేషనల్స్‌కు ఎంపికయ్యారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న ఉద్యోగులు ఈ పోటీలలో పాల్గొన్నారు. రవికుమార్ జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.నయోమి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.



డాక్టర్ రవికుమార్

భూముల రీ సర్వేతో రైతులకు మేలు

- పల్నాడు జేసీ శ్యాంప్రసాద్
- త్వరలో గురజాల, సత్తెనపల్లి సర్వే పనులు



కనమర్లపూడిలో రైతులకు భూహక్కు పత్రాలను అందజేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టరు శ్యాంప్రసాద్

శావల్యాపురం: రైతుల భూములు రీసర్వే చేయటం ద్వారా భవిష్యత్‌లో భూ వివాదాలకు తావులేకుండా ఉంటాయని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కనమర్లపూడిలో రైతులకు భూహక్కు పత్రాలు శుక్రవారం అందజేశారు. జేసీ మాట్లాడుతూ భూ హక్కు పత్రాలు పొందిన రైతులు ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీ సర్వేను ఆధునిక యంత్ర పరికరాలు ద్వారా కొలతలు తీశారని చెప్పారు. భూహక్కు పత్రాలు పోయిన రైతులు ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో రైతులు అర్జీ చేసుకుని తగిన రుసుం చెల్లిస్తే సత్వరమే మంజూరు చేసేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో రెండో విడతలో 45 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులు పూర్తి అయినట్లు వివరించారు. అందులో భాగంగా 18 వేల భూహక్కు పత్రాలు మంజూరు కాగా, అందులో 6 వేల పత్రాలను రైతులకు అందజేసినట్లు తెలిపారు. 30 వేల భూహక్కు పత్రాలు రావాల్సి ఉందన్నారు. జిల్లాలో సరిహద్దు రాళ్లు 52 వేల 390 మంజూరు కాగా 42 వేల రాళ్లను సంబంధిత రైతులు, ప్రభుత్వ భూముల్లో ప్లాంటేషన్ చేశామని చెప్పారు. ఈ నెలఖారులోగా నూరు శాతం పనులు పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మూడో విడత గురజాల, సత్తెనపల్లి తదితర నియోజకవర్గాల్లో వంద రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అనంతరం ప్రభుత్వ భూముల్లో స్టోన్ ప్లాంటేషన్ పనులు పరిశీలించారు. కనమర్లపూడి రెవెన్యూ పరిధిలో శావల్యాపురం -732, కనమర్లపూడి-708 మంది రైతులకు భూహక్కు పత్రాలు పంపిణీ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు సర్పంచి తన్నీరు భారతి, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, డెప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఆర్‌ఐ పి.నాసరయ్య, వీఆర్వో ఉప్పుటూరి చిన మంగయ్య కార్యదర్శి డి.రవీంద్రబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ సర్పంచి తన్నీరు అంకారావు, బోడెపూడి కొండలు, కోటయ్య పాల్గొన్నారు.

ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన

వినుకొండ(నూజెండ్ల): అర్హత కలిగిన యువతీ యువకులందరూ ఓటుహక్కు నమోదు చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కోరారు. స్థానిక గంగినేని కల్యాణి డిగ్రీ కళాశాలలో ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ప్రభుత్వం కల్పించే ఓటు హక్కును పొందాలని సూచించారు. డిగ్రీ చదివే యువతీ యువకులు అందరికీ ఆదర్శంగా ఉండాలని ఉన్నతమైన ఆశయంతో చదవాలని వారికి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాలు పంపిణీ

రొంపిచర్ల: మండలంలోని దాసరిపాలెం రెవెన్యూ పరిధిలోని బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో రైతులకు వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షా పథకంలో భాగంగా రీసర్వే పూర్తిచేసుకొని జగనన్న భూహక్కు పత్రాలను ఆర్డీఓ శేషిరెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. భూ రీసర్వేలో భాగంగా రైతుల భూములను గుర్తించి హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. రైతుల భూపట్టాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంకారావు, డీటీ బాల వెంకటేశ్వర్లు, ఆర్ఐ సుబ్బారావు పాల్గొన్నారు.



హక్కు పత్రాలు అందుకున్న భూ యజమానులతో ఆర్డీఓ శేషిరెడ్డి

పార్టీలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్ పాలన

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- విప్పర్లలో గడప గడపకు మన ప్రభుత్వం
- రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం ప్రారంభం



గ్రామంలో మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని విప్పర్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం శుక్రవారం రాత్రి నిర్వహించారు. గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.80 లక్షలతో నాడు- నేడులో భాగంగా పాఠశాలలు అభివృద్ధి చేసినట్లు వివరించారు. రూ.17.50 కోట్లతో నవరత్నాల సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. ఆర్‌బీకే, హెల్త్ సెంటర్లను రూ.40లక్షలతో నిర్మించినట్లు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీరాజ్ నిధులైన రూ.70 లక్షలతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి గోరంట్ల సీతమ్మ, ఎంపీపీ గడ్డం వెంకటరావు, ఎంపీటీసీ తెలగనేని వెంకటేశ్వరరావు, సర్పంచులు జిడ్డు ఎర్రయ్య, కసిరెడ్డి వెంకటకోటిరెడ్డి, గానుగపంట ఉత్తమరెడ్డి, దిద్దుకుంట సైదులురెడ్డి, పాలిమేర వెంకటరెడ్డి, గుండాల వెంకటేష్, జిల్లా యువజన విభాగ అధ్యక్షులు పడాల సాంబశివారెడ్డి, వద్దుల కోటిరెడ్డి, గుజ్జుల ప్రభాకరరెడ్డి, కంచేటి రామారావు, గోపు గోపిరెడ్డి, చపారపు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రాధా, కృష్ణ వేషధారణలు

నరసరావుపేట ఈస్ట్: శ్రీవాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని గురువారం రాత్రి గీతామందిరంలో చిన్నారుల రాధా, కృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్ ముఖ్యఅతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వూరా భాస్కరరావు, అరవపల్లి సత్యనారాయణ, ప్రవళిక సత్యం, కొప్పురావూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా కొత్తమాసు సుజాతలక్ష్మి, యక్కల సుజాత, బచ్చు రమాదేవి, వూరా లక్ష్మీసుజాత, జొన్నలగడ్డ నాగరాజేశ్వరి వ్యవహరించారు.



వేషధారణ చిన్నారులతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తదితరులు

ఇస్కాన్‌లో ముగిసిన జన్మాష్టమి వేడుకలు..

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరాధ గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ముగిశాయి. వేడుకలలో చివరిరోజు శుక్రవారం శ్రీల ప్రభుపాదుల 127వ శ్రీవ్యాసపూజ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

అంకిత భావంతో పనిచేసే ఉపాధ్యాయులను గౌరవించాలి

చిలకలూరిపేట: అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని పసుమర్రులోని మద్ది కామయ్య జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వై.హనుమంతరావు చెప్పారు. పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పాఠశాలకు చెందిన ఆంగ్లం ఉపాధ్యాయుడు షేక్ మొహమ్మద్ యాసిన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రతి ఏటా ఆంగ్లంలో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు యాసిన్ కృషి చేస్తున్నారని కొనియాడారు. దీనికి తోడు ఆంగ్లంలో 91 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ యర్రం వెంకటసుబ్బయ్య, వైస్ చైర్‌పర్సన్ తన్నీరు నాగవర్ధిని, 15,16 వార్డు కౌన్సిలర్లు జాలాది సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు గద్దే హరిబాబు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత షేక్ మొహమ్మద్ యాసిన్ ను సన్మానిస్తున్న దృశ్యం

శ్రావణ శుక్రవారం వేడుకలు

రొంపిచర్ల: మండల ప్రజలు శ్రావణ శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని విప్పర్ల గ్రామంలోని గంగా పార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి ఆలయంలోని కామాక్షి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే వడ్లమూడివారిపాలెం, కొత్తపల్లి, రొంపిచర్ల, బుచ్చిబాపన్నపాలెం, మాచవరం, పరగటిచర్ల, సంతగుడిపాడు తదితర గ్రామాలలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయ ప్రధాన అర్చకులు శ్రావణ శుక్రవారం విశిష్టత గురించి భక్తులకు వివరించారు.

మిరప సాగు పరిశీలన

నరసరావుపేట రూరల్: రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలతో మండలంలో మిరప నారు నాటే కార్యక్రమం మండలంలో జోరందుకుంది. యల్లమందలో మిరప నాటును ఉద్యాన శాఖాధికారి దాసరి నవీన్‌కుమార్, వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు శుక్రవారం పరిశీలించారు. మిరప సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఉద్యాన శాఖాధికారి నవీన్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో సుమారు 300 ఎకరాల్లో మిరప పంటను రైతులు సాగుచేస్తున్నట్లు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా మిరప సాగు ఆలస్యం అయిందని చెప్పారు. రైతులు ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సాయినాథ్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.



మిరప పంటను పరిశీలిస్తున్న అధికారులు

పోషకాహారంతో రక్తహీనత నియంత్రణ

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామం అంగన్‌వాడీ సెంటరు నందు పోషకాహార మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ పి. సీతారామయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులు, బాలింతలు చిన్నారులకు ప్రభుత్వం అందించే పోషకాహాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో కూడిన ఆకు కూరలు, మునగ ఆకు, తోట కూర, పప్పు దినుసులతో కూడిన ఆహారాన్ని భుజించటం ద్వారా రక్తహీనత నియంత్రణకు దోహదపడతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి యలగాల బసవయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, ఆరోగ్య కార్యకర్త లింగాల శ్రీలలితా, ఏపీఓ రామారావు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ సీతారామయ్య

చేతిసంచుల పంపిణీ

నరసరావుపేట: పర్యావరణ హితం కోరుతూ విశ్వజనని ఫౌండేషన్ రూపొందించిన చేతి సంచులను పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ అండ్ ఫౌండర్ బొగ్గవరపు బ్రహ్మానందం మాట్లాడుతూ ఎమ్మెల్యే జన్మదినమైన ఈనెల 12న రెండువేల చేతి సంచులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొత్త సాంబశివరావు, చిన్ని వెంకట శ్రీనివాసరావు, పల్లబోతు ప్రకాశరావు పాల్గొన్నారు.



చేతి సంచులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, విశ్వజననీ ఫౌండేషన్ ప్రతినిధులు

కొప్పుకొండలో సత్యమ్మ దేవాలయ ప్రతిష్టా కార్యక్రమం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలం కొప్పుకొండలో గ్రామ దేవత సత్యమ్మ నూతన దేవాలయం విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, ధ్వజారోహణం, ధాన్యాధివాసం, జలాధివాసం ప్రత్యే పూజలతోపాటు, హోమాలు నిర్వహించారు. నూతన దేవాలయ ప్రతిష్టా ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు చెన్నయ్య, గ్రామ ఉప సర్పంచి కోలా వీరాంజనేయులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.



దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా, మాజీ ఎమ్మెల్యే మక్కెన తదితరులు

ప్రతి ఒక్కరూ సొమ్ము పొదుపు చేసుకోవాలి

లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసప్రసాద్

నరసరావుపేట: ప్రతి ఒక్కరూ సొమ్మును పొదుపు చేసుకుంటూ నగదు రహిత లావాదేవీలతో సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం వినుకొండ రోడ్డులోని ఓ కన్వెన్షన్ హాలులో అవార్డు సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై డిపాజిటర్ల ఎడ్యుకేషన్ అవేర్‌నెస్ ఫండ్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు చీఫ్ మేనేజర్ రామ్ మాట్లాడుతూ సామాజిక భద్రతా పథకాలైన ప్రధానమంత్రి సురక్షా, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, అటల్ ఫంక్షన్ యోజన చేసుకోవాలని సూచించారు. డీసీసీబీ మేనేజర్ రజని మాట్లాడుతూ ప్రైవేటు చీటీ పాటలు, ఆన్‌లైన్ రుణయాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆర్థిక శాస్త్ర నిపుణులు శ్రీనివాసరావు, ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ మురళీకృష్ణ, ఎస్‌బీజే చీఫ్ మేనేజర్ గిరిబాబు, అవార్డు సంస్థ సీఈఓ రమణయ్య పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బ్యాంకు అధికారులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

నరసరావుపేట రూరల్: క్రీడల ద్వారా శారీరకంగా దృఢత్వంతో పాటు మానసిక ఉత్తేజాన్ని పొందవచ్చని మండల విద్యాశాఖ అధికారి ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో ప్రత్యేక అవసరాల గల బాల, బాలికల జిల్లా స్థాయి ఆటల పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లోని ప్రత్యేక అవసరాల గల పిల్లలను శారీరకంగా, ఆరోగ్యంగా, మానసికంగా అప్రమత్తం చేయడానికి ఈ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాఠశాల పాఠ్యాంశాల్లో క్రీడలు, ఆటలను ప్రోత్సహించేందుకు పోటీలు దోహదపడతాయని వివరించారు. ప్రాథమిక పాఠశాల స్థాయిలో డ్రాప్ అవుట్ రేటును తగ్గించేందుకు, గ్రామీణ ప్రతిభావంతులను శోధించేందుకు, క్రీడలలో విభిన్న కార్యక్రమాలను చేపట్టేందుకు పాఠశాలలను సిద్ధం చేసేందుకు పోటీలు ఉపకరిస్తాయని పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయిలో ప్రత్యేక అవసరాలున్న పిల్లలలో ఆరోగ్యం, వ్యాధులు, శారీరక దృఢత్వం గురించి సంపూర్ణ అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. పోటీలలో భాగంగా వంద మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, సాఫ్ట్‌బాల్ త్రో, షాట్‌పుట్, స్లో వాక్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంఓ పి.శ్రీనివాసరావు, ఏఎల్ఎస్‌సీ కె.శ్రీనివాసరావు, ఏఈడీ కోఆర్డినేటర్ జి.మల్లికార్జున, పాఠశాల హెచ్ఎం పార్వతీ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ నాగేశ్వరరావు


మద్యానికి డబ్బులు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని మనస్తాపంతో ఫ్యానుకు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు.. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం బాదంపూడి గ్రామానికి చెందిన కొసిరెడ్డి సాయిదుర్గారావు(23) పట్టణంలోని టిడ్కో గృహాల్లో నివసిస్తున్నారు. రెండు సంత్సరాల కిందట వివాహమైంది. వారికి మూడు నెలల బాబు ఉన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున మద్యం మత్తులో ఇంటికి వచ్చి మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తల్లి, భార్యపై దాడి చేశాడు. అనంతరం భార్య డ్రస్‌తో ఫ్యానుకు ఉరి వేసుకొన్నాడు. స్థానికులు, తల్లి తలుపులు పగలగొట్టి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లి వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమం అభివృద్ధిలో ఏపీ ముందంజ

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల భవిష్యత్‌కు బంగారుబాటలు వేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని గామాలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం సందర్శించారు. నాడు- నేడు ద్వారా పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనులు పరిశీలించారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకున్న దస్తగిరమ్మను సన్మానించారు. ఎమ్మెల్సీ జంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ఆహ్లాదకర వాతావరణం కల్పించారని చెప్పారు. పిల్లల హాజరుశాతం బాగా పెరిగిందని పేర్కొన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో చదువుకునే వారంతా ప్రభుత్వ పాఠశాలల వైపు చూస్తున్నారని వివరించారు. ఒక వైపు అభివృద్ధి మరో వైపు సంక్షేమ పథకాల అమలులో ఏపీ ముందంజలో ఉందని చెప్పారు. ఎమ్మెల్సీ వెంట జెడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకటకోటయ్య, సర్పంచి జంగా సురేష్, ఎంపీటీసీ సభ్యుడు షేక్ ఆదాంసాహెబ్, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ చాప శేషయ్య పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయిరాలు దస్తగిరమ్మను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ జంగా